సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



ప్రభుత్వ దవాఖానాలను..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



నియామకాలపై నీలినీడలు

కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎం పోస్టుల భర్తీలో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కరోనా సమయంలో పనిచేసిన వారు కోరుతున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.8 /18.7

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డిస్ట్రిబ్యూటరీల ద్వారా చెరువులు నింపాలి

- ఎస్సారెస్పీ సీఈతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్: కాకతీయ కాలువ ద్వారా దిగువ భాగానికి నీటిని విడుదల చేస్తున్న దృష్ట్యా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా ఏర్గట్ల మండలంలోని చెరువులు నింపాలని ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డిని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కోరారు. కాకతీయ కాలువ కింద ఉన్న 18, 19, 20 డిస్ట్రిబ్యూటరీలకు నీటిని విడుదల చేయాలన్నారు. యాసంగి సీజన్ పంటల సాగు వేగం పుంజుకున్నందున సాగునీటి విడుదలకు ఏర్పాట్లు చేయాలన్నారు. లేదంటే రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రోడ్లు ఊడ్చి నిరసన



నిజామాబాద్ అర్బన్: సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న సమ్మె గురువారం కొనసాగింది. ఉద్యోగులు ధర్నా చౌక్ నుంచి పాత కలెక్టరేట్ వరకు రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, ఉపేందర్ మాట్లాడుతూ.. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనకు 20 రోజులుగా నిరసన, సమ్మె కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఇకనైనా తమ సమస్యలు గుర్తించి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అనంతరం వీరి సమ్మెకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఈశ్వర్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్ మద్దతు పలికారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

న్యాయవాదులు ఈ-ఫైలింగ్ చేసుకోవాలి



ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్న జిల్లా న్యాయవాదులు ఈ-ఫైలింగ్ చేసుకోవాలని బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్‌గౌడ్ గురువారం తెలిపారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ-కోర్టు వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకుని వెబ్‌సైట్‌లోనే సివిల్ దావాలు, క్రిమినల్ కేసులలో బెయిలు దరఖాస్తు చేసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. దరఖాస్తులు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న ఈ-కోర్టు సర్వీసెస్ ఆన్‌లైన్ పోర్టల్‌లోనే తెలంగాణ బార్ కౌన్సిల్ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీవోపీ) ఆధార్ అడ్రస్ ప్రూఫ్ ఫొటోతో పాటు న్యాయవాదులు ప్రమాణం చేసి, నమోదుకు అవకాశం ఉందన్నారు. ప్రతి న్యాయవాది ఈ-పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశం మేరకు జనవరి 15 లోగా న్యాయవాదులు అందరూ తప్పక ఈ-ఫైలింగ్ చేసుకువాలని సూచించారు. దీంతో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆదేశం మేరకు న్యాయవాదులందరూ డిసెంబర్ 31లోపు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీవోపీ) రెన్యువల్ సంబంధిత సర్టిఫికెట్లతో అప్లికేషన్లు బార్ కౌన్సిల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. న్యాయవాదులు తప్పక తమ వృత్తి నిర్వహణ సర్టిఫికెట్లను పొందాలని కోరారు.



రోడ్డు ఆక్రమించడంతో పాటు జీప్లస్ వన్ అనుమతితో జీప్లస్ త్రీ నిర్మాణం



వినాయక్ నగర్‌లోని విశ్వభారతి స్కూలు ప్రాంతంలో పార్కు మూడోవైపు గోడ నిర్మాణం చేయని దృశ్యం

పరిష్కారం బదులు.. సమస్యల సృష్టి

- నగరపాలక సంస్థలో టీపీవో తీరు
- అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోకుండా అడ్డుపడుతున్న వైనం
- మరోవైపు రిటైర్డ్ ఉద్యోగితో కలిసి సక్రమంగా ఉన్నవాటికీ అడ్డంకులు
- ఉద్యోగోన్నతిపై మెట్‌పల్లి వెళ్లినప్పటికీ ఇందూరులోనూ విధులు
- రెండుచోట్లా దోపిడీ పర్వం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటే వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సింది ఉద్యోగులు. అయితే నిజామాబాద్ నగరపాలక సంస్థలో మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. ప్రభుత్వ ఫీజులకు గండి కొట్టే విషయంలో ముందంజలో ఉంటున్నారు. అక్రమ కట్టడాలను తొలగించకుండా ముడుపులు తీసుకుని ప్రజాప్రయోజనాలను తుంగలో తొక్కుతున్నారు.

2008 నుంచి రోడ్డు వేయకుండా..

వినాయక్‌నగర్‌లోని విశ్వభారతి పాఠశాల ప్రాంతంలో లేఅవుట్‌కు సంబంధించి రోడ్డు విషయమై అప్పట్లో సర్వే అండ్ ల్యాండ్ రెవెన్యూ విభాగంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన కె భూపతిరావు తన పర్సనల్ ఇంట్రస్ట్‌తో ఆ ప్రాంతవాసులను ఇబ్బందుల పాలు చేసేందుకు 2008లో బీజం వేశాడు. ప్రస్తుతం రిటైర్డు అయిన భూపతిరావుకు అప్పట్లో అడిగినన్ని డబ్బులు ఇవ్వకపోవడంతో ఈ సమస్యకు అంకురార్పణ చేశాడని ఆరోపణలు ఉన్నాయి. సదరు లేఅవుట్‌లో పార్క్ పక్కన ఉన్న రోడ్డును సైతం పార్కులో కలిపేసే కుట్ర చేశాడు. పక్కన మరో సర్వే నంబర్‌లో శ్యాంసుందర్‌రెడ్డి అనే వ్యక్తి భవనం పక్కన 15 అడుగులు, పార్క్ పక్కన మరో 15 అడుగులు కలిపి 30 అడుగుల రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే పార్కు దాటి రోడ్డు స్థలంలోకి 15 అడుగులు వచ్చి పార్కు గోడ కట్టాలంటూ భూపతిరావు అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులను తప్పుదోవ పట్టించాడు. పైగా తన వ్యక్తిగత ద్వేషంతో హైకోర్టు నుంచి స్టేటస్‌కో తెచ్చాడు. 2009లో అప్పటి మున్సిపల్ కమిషనర్ పాపయ్య ఆ 15 అడుగులు పార్కు స్థలం కాదని, రోడ్డులోకి వస్తుందని, భూపతిరావు పర్సనల్ ఇంట్రస్ట్‌తో ఇలా చేసినట్లు తెలిపారు. అయితే భూపతిరావు మాత్రం రోడ్డును ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించినట్లు చెబుతూనే, అందుకు సంబంధించి సర్వే మాత్రం చేయకుండా అడ్డుపడుతూ వచ్చాడు. పార్కు విషయమై స్టేటస్‌కో ఉందని, పక్కన ఉన్న మరో సర్వే నంబర్‌లో సైతం సర్వే చేయొద్దని భూపతిరావు అడ్డుపుల్లలు వేశాడు. ఈ క్రమంలో 2010లో ప్రభుత్వ న్యాయవాది నివేదిక ఇవ్వడంతో కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ విభాగం వాళ్లు సర్వే చేశారు. 2013లో మరోసారి సర్వే చేసి 2014లో పార్కు గోడ మంజూరు చేశారు. ఈ సమయంలో ఇక్కడ 30 అడుగుల రోడ్డు ఉందని అప్పటి కమిషనర్ మంగతాయారు లేఖ ఇచ్చారు. 2020లో కాలనీవాసులు హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. తరువాత 2021లో పార్కుకు మూడువైపులా గోడ కట్టారు. రోడ్డు ఉన్నవైపు మాత్రం కట్టలేదు. 2024 జూన్ 4న భూపతిరావు తెచ్చిన స్టేటస్‌కోను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఒక వ్యక్తి పర్సనల్ ఇంట్రస్ట్‌తో పిల్ ఎలా వేస్తారని హైకోర్టు చీవాట్లు పెట్టింది. అయినప్పటికీ పార్కుకు నాలుగోవైపు గోడ కట్టించకపోవడంతో కాలనీవాసులు ఫెన్సింగ్ వేయించారు. భూపతిరావు రాత్రికిరాత్రి ఈ ఫెన్సింగ్ పడగొట్టించినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. ఇక్కడ గమనించాల్సిందేమిటంటే భూపతిరావు సైతం రోడ్డును ఆక్రమించడం విశేషం.

■ భూపతిరావుతో మిలాఖత్ అయిన ప్రస్తుత నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ రాజేంద్రప్రసాద్ పార్కు పక్కన 30 అడుగుల రోడ్డు వేయకుండా అడ్డుకుంటూ వస్తున్నాడు. రోడ్డు వేసే ప్రయత్నం చేస్తే ఆక్రమణ అంటూ కేసు పెట్టించాడు. గత కమిషనర్ మకరందును సైతం రాజేంద్రప్రసాద్ తప్పుదోవ పట్టించాడు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన మకరందు రాజేంద్రప్రసాద్‌కు చీవాట్లు పెట్టి కేసు విత్‌డ్రా చేయించాడు. కమిషనర్ మకరందు బదిలీ కావడంతో సమస్య మాత్రం అపరిష్కృతంగానే ఉంది. ఈ క్రమంలో పాములు, విష కీటకాలు వస్తుండడంతో రోడ్డును బాగుచేయించి, పిచ్చిమొక్కలు తొలగించిన స్థానికులపై రాజేంద్రప్రసాద్ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించాడు. మున్సిపాలిటీ ద్వారా శుభ్రం చేయించాలని అడిగితే తమ ఇష్టం వచ్చినప్పుడు చేస్తామంటూ దబాయిస్తూ వస్తున్నాడు. పాములు వస్తే రానీయండి అంటూ వెకిలిగా మాట్లాడుతున్నాడని స్థానికులు చెబుతున్నారు.

రాజేంద్రప్రసాద్‌కు టీపీఎస్ నుంచి టీపీవోగా ఉద్యోగోన్నతి వచ్చి మెట్‌పల్లికి బదిలీ అయినప్పటికీ ఇక్కడి నుంచి వెళ్లడానికి మొగ్గుచూపడం లేదు. మెట్‌పల్లిలో మూడురోజులు, నిజామాబాద్‌లో మూడు రోజులు పనిచేసేలా పైరవీ చేసుకున్నాడు.సమస్యలు సృష్టించడం, దాన్ని పరిష్కారం కాకుండా చూడడం, దండుకోవడం అనే సూత్రంతో పనిచేస్తున్నట్లు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మచ్చుకు ఒక విషయం పరిశీలిస్తే రాజేంద్రప్రసాద్ విశ్వభారతి పాఠశాల సమీపంలోనే ఒక 125 గజాల ఇంటిని జీప్లస్ వన్

బదిలీ అయినా..

అనుమతితో జీప్లస్ త్రీతో 80 అడుగుల రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేసినప్పటికీ డబ్బులు తీసుకుని తొలగించకుండా కథ నడిపిస్తున్నాడని పలువురు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ కాలనీవాసులు రాజేంద్రప్రసాద్ మీద కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు సైతం చేశారు.

■ నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ మీద జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించగా, ఇందుకు విరుద్ధంగా విచారణను వదిలేసి నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ తయారు చేసిన ప్లానర్ తరఫున ఉండి, బాధితుడిని బెదిరించి సెటిల్‌మెంట్ దందా చేయడం విశేషం. నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ తయారు చేసిన ఇంజినీరును కాపాడి ఫిర్యాదు చేసిన ఫ్లాట్ ఓనర్‌ను బెదిరించి ఫీజు కట్టించడం, ఫిర్యాదును విత్‌డ్రా చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేయడం గమనార్హం. రాజేంద్రప్రసాద్ వ్యవహారాలపై కమిషనర్ దిలీప్‌కుమార్‌ను 'సాక్షి' సంప్రదించగా విచారణ చేసి తగిన విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పార్కు స్థలం విషయమై రెవెన్యూ, నగరపాలక సంయుక్త సర్వే చేసి పరిష్కారం చేస్తామన్నారు.



రోడ్డును ఆక్రమించి నిర్మించిన పార్కింగ్ ఫ్లాట్‌ఫాం

సామూహిక అత్యాచారం వల్లే మహిళ మృతి

- ప్రాథమిక విచారణలో గుర్తించిన పోలీసు వర్గాలు
- నిజామాబాద్ నగరంలోని వ్యభిచారం గృహంలో ఘటన
- లోతుగా వివరాలు సేకరిస్తున్న ఎస్బీ, ఇంటెలిజెన్స్ బృందాలు

సాక్షి ఎఫెక్ట్..



ఖలీల్‌వాడి/రెంజల్(బోధన్): నిజామాబాద్ నగరంలోని వ్యభిచార గృహంలో మహిళ సామూహిక అత్యాచారం వల్లే తీవ్రగాయాల పాలై మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు సమాచారం. గురువారం సాక్షిలో 'అత్యాచారం.. మహిళ మృతి' శీర్షికన ప్రచురితమైన వార్తకు పోలీసులు స్పందించారు. ఎస్బీ, ఇంటెలిజెన్స్ వర్గాలు ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తున్నాయి.

రెంజల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన సుమారు 40 ఏళ్ల మహిళకు వదిన వరుస అయ్యే ఆడపడుచు నగరంలోని ఓ ప్రాంతంలో అద్దెకు ఉంటూ కొంతకాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విటులు రాగానే తన మరదలిని గ్రామం నుంచి గత శుక్రవారం నగరానికి పిలిపించినట్లు తెలిసింది. మహిళపై విటులు సామూహిక అత్యాచారం జరిపారని, ఈ సందర్భంగా వ్యభిచార గృహ నిర్వాహకురాలిని సైతం బెదిరించినట్లు సమాచారం.. తీవ్ర అస్వస్థతకు గురైన బాధిత మహిళ మృతి చెందడంతో శనివారం గ్రామానికి మృతదేహాన్ని తరలించి హడావుడిగా అంత్యక్రియలు నిర్వహించారు. కాలనీ వాసులు పోలీసులకు సమాచారం అందించాలని చెప్పినప్పటికీ దహన సంస్కారాలు నిర్వహించినట్లు ఎస్బీ, ఇంటెలిజెన్స్ పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. కాగా మహిళ మృతికి సంబంధించి వ్యభిచార గృహ నిర్వాహకురాలు నోరు విప్పితేనే అసలు విషయాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. మృతురాలి అస్తికలను తీసుకుని ఫోరెన్సిక్స్ ల్యాబ్‌కు పంపించే అవకాశాలు ఉన్నాయి. మహిళపై సామూహిక అత్యాచారం జరిగిందా ? లేక చెప్పినట్లు వినకపోతే విటులు జరిపిన దాడిలో మరణించిందా ? కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్బీ, ఇంటిలిజెన్స్ అధికారులు మూడో టౌన్ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. మూడో టౌన్ ఎస్సై హరిబాబును సంప్రదించగా విచారణ కొనసాగుతోందని చెప్పారు.

సొసైటీలు మరింత బలోపేతం!

- డిజిటలైజేషన్ దిశగా సహకార వ్యవస్థ
- కసరత్తు చేపట్టిన కేంద్రం
- ఆన్‌లైన్‌లో పూర్తయిన సంఘాల వివరాల నమోదు
- జిల్లాలో 3,022 సహకార సంఘాలు



డొంకేశ్వర్(ఆర్మూర్) : సహకార వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం మార్పులు తేవాలని భావిస్తోంది. సొసైటీలను మరింత బలోపేతం చేసి వాటి ద్వారా విస్తృతంగా సేవలు అందించాలని చూస్తోంది. ఇందుకు సహకార వ్యవస్థలో డిజిటలైజేషన్ విధానాన్ని తీసుకువచ్చే దిశగా కేంద్రం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే దేశమంతటా వివిధ రంగాల్లో రిజిస్టరై ఉన్న సంఘాల వివరాలను సేకరించింది. జిల్లా నుంచి కూడా సొసైటీల డేటాను సహకార శాఖ ఎన్‌సీడీసీ పోర్టల్‌లో నమోదు చేసింది. జిల్లాలో 27 రంగాల్లో కలిపి మొత్తం 3,187 సహకార సంఘాలు ఉండగా, 3,022 సంఘాల వివరాలను సెంట్రల్ సర్వర్‌లో ఎంట్రీ చేశారు. జిల్లాలో అత్యధికంగా యాక్టివ్‌గా ఉండే స్వయం సహాయక సంఘాలు 1,500 వరకు ఉండగా, మత్స్య సహకార సంఘాలు 361 ఉన్నాయి. అలాగే రైతులతో ఎక్కువ సంబంధాలు కలిగిన ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు)89 ఉన్నాయి. ఈ మూడు రంగాల్లోనే సొసైటీలు ఎక్కువగా సేవలందిస్తూ రాణిస్తున్నాయి. వీటితో పాటు హౌసింగ్, లేబర్, పౌల్ట్రీ, ఇతర రంగాల సొసైటీలు ఉన్నప్పటికీ వీటి పనితీరు పెద్దగా బయటకు కనిపించదు. ప్రజలు, రైతులతో ఎక్కువ సంబంధాలు కలిగిన సొసైటీలను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆలోచన చేసింది. సంఘాలను మరింత పెంచడంతో పాటు వాటి పరిధిని ప్రతి మూలకు విస్తరింజేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు తొలి అడుగుగా సహకార వ్యవస్థను డిజిటలైజేషన్ చేయాలని సహకార శాఖకు ఆదేశాలు అందాయి. ప్రతి సంఘానికి సంబంధించిన లావాదేవీలు, ఆడిట్ రిపోర్టులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయడం ఇటీవల పూర్తి చేశారు. వచ్చే నూతన ఏడాదిలో సహకార వ్యవస్థలో మార్పులు తెచ్చి ఆర్థికపర సహకారాన్ని కూడా అందించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు కావాల్సిన అన్ని సేవలను అందించాలని భావిస్తోంది. వ్యవసాయ సబ్సిడీలను కూడా సొసైటీ ద్వారానే అందించే అవకాశం ఉంది. మహిళా సంఘాలు, మత్స్యకార సొసైటీలకు సైతం సబ్సిడీలను ఇచ్చే అవకాశం ఉందని సహకార శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

డేటా ఎంట్రీ పూర్తయింది



సహకార సంఘాల బలోపేతం చేయడానికి వాటి సంఖ్యను పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సహకార వ్యవస్థను డిజిటలైజేషన్ చేయడం, డేటాను పోర్టల్‌లో నమోదు చేయించే ప్రక్రియ పూర్తయింది. మార్గదర్శకాలు వస్తే దీనిపై స్పష్టత రావడానికి అవకాశం ఉంది.

–శ్రీనివాస్‌రావు, జిల్లా సహకార శాఖ అధికారి

అసలేం జరిగింది..

- ఎస్సై, మహిళా కానిస్టేబుల్, యువకుడి మరణాలపై ఎన్నో అనుమానాలు
- ఆరా తీస్తున్న పోలీసులు.. పోస్టుమార్టం నివేదిక తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం



ఎస్సై సాయికుమార్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం : భిక్కనూరు ఎస్సై సాయికుమార్(32), బీబీపేట పీఎస్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ శ్రుతి(30), బీబీపేటకు చెందిన తోట నిఖిల్ (29)ల ఆత్మహత్య ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎస్సై, కానిస్టేబుల్ చనిపోవడం పోలీసు శాఖలో కలకలం రేపింది. కాగా వారి మృతికి స్పష్టమైన కారణాలు తెలియడం లేదు. అసలేం జరిగి ఉంటుంది అన్న విషయాన్ని తెలుసుకునే పనిలో పోలీసు అధికారులున్నారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత శ్రుతి, నిఖిల్‌ల మృతదేహాలు సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులోగల పెద్ద చెరువులో లభించిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఎస్సై మృతదేహం లభ్యమైంది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ముగ్గురి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు సిబ్బంది ఎస్సై, కానిస్టేబుల్ మృతదేహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకువెళ్లి అంత్యక్రియలు జరిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ పోస్టుమార్టం అనంతరం వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు. వారి మరణాలకు గల కారణాలపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామన్నారు.

అంతుచిక్కని కారణాలు...

ఎస్సై సాయికుమార్ స్వస్థలం మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రం. 2018 బ్యాచ్‌కు చెందిన ఆయన 2022 ఏప్రిల్ 13 న బీబీపేటలో ఎస్సైగా చేరారు. సుమారు 16 నెలల తర్వాత భిక్కనూరు ఎస్సైగా బదిలీ అయ్యారు. గాంధారి మండల కేంద్రానికి చెందిన శ్రుతి బీబీపేటలో 2021 నుంచి కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో ఇరువురి మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరో మృతుడు బీబీపేటకు చెందిన తోట నిఖిల్ సహకార బ్యాంకులో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూనే కంప్యూటర్ల మరమ్మతులు చేసేవాడు. పోలీసు స్టేషన్‌కు చెందిన కంప్యూటర్లు మొరాయించినపుడు వచ్చి రిపేర్ చేసి వెళ్లేవాడు. ముగ్గురి మృతదేహాలు ఒకేసారి చెరువులో లభించడంతో మృతికి కారణాలు ఏమై ఉంటాయన్న అంశంపై చర్చ నడుస్తోంది. చెరువు సమీపంలో నిలిపిన ఎస్సై కారులో శ్రుతి బ్యాగు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ ముగ్గురు కలిసే చెరువు వద్దకు వచ్చారా, వేరువేరుగా వచ్చారా.. వీరి మధ్య ఏదైనా గొడవ జరిగిందా అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ముగ్గురిలో ఒకరు ఆత్మహత్య చేసుకునేందుకు చెరువులో దూకితే.. రక్షించేందుకు మిగతా ఇద్దరు ఒకరి వెనుక ఒకరుగా వెళ్లి నీట మునిగి ఉంటారా అన్న కోణంలోనూ విచారణ సాగుతోంది.



మృతుల కుటుంబాలకు షబ్బీర్ అలీ పరామర్శ

ఆస్పత్రి వద్ద మిన్నంటిన రోదనలు

కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీ వద్దకు మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారి రోదనలు మిన్నంటాయి. ఎస్సై సాయికుమార్ తండ్రి అంజయ్య మాట్లాడుతూ తన కొడుకు కష్టపడి చదివి ఉద్యోగం సాధించాడని, ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదన్నారు. ఎవరో ఒకరిని కాపాడే ప్రయత్నంలో చనిపోయి ఉండొచ్చన్నారు. శ్రుతి తండ్రి పుండరీకం మాట్లాడుతూ తన కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఎలా జరిగిందనేది పోలీసులు తేల్చాలన్నారు. నిఖిల్ చనిపోయిన విషయం పోలీసులు చెబితే తెలిసిందని అతని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అసలేం జరిగింది, ఎందుకు జరిగింది కూడా తమకు అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ గురువారం ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

చదువులో టాపర్

భిక్కనూరు: ఆత్మహత్య చేసుకున్న భిక్కనూరు ఎస్సై సాయికుమార్ చిన్నతనం నుంచి చదువులో ముందున్నారు. 2007–2008లో పదోతరగతిలో మండల టాపర్‌గా నిలిచారు. ఇంటర్‌లోనూ మంచి మార్కులు సాధించారు. హైదారాబాద్‌లోని సీబీఐటీలో కన్వీనర్ కోటాలో బీటెక్‌లో ప్రవేశం పొంది ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేశారు.

ఒకే ఏడాది మూడు ఉద్యోగాలకు ఎంపిక

సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సాయికుమార్.. మంచి ఉద్యోగం సంపాదించాలన్న లక్ష్యంతో చదివారు. 2018 పోస్టల్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం సాధించారు. అదే సమయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ వెంటనే నిర్వహించిన ఎస్సై పరీక్షలోనూ ఎంపికయ్యారు. మొదటి పోస్టింగ్ సిద్దిపేట జిల్లా చిన్నకోడురులో ఎస్సైగా చేరారు. తదుపరి బాన్సువాడలోనూ ఎస్సైగా పనిచేశారు. ఎస్సై సాయికుమార్ రెండు పర్యాయాలు ఎస్పీ సింధుశర్మ చేతులమీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. డీజిల్ దొంగలను పట్టుకోవడంతో పాటు కంచర్లలో జరిగిన హత్య కేసులో నిందితులను పట్టుకోవడంతో ఎస్పీ సింధుశర్మ అభినందించారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి సాయికుమార్ ఒక్కరే తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపికయ్యారు.

ప్రేమ వివాహం



సాయికుమార్ 2022లో కర్నూల్ జిల్లా నంద్యాలకు చెందిన మహలక్ష్మిని ప్రేమించి పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. మహలక్ష్మి ప్రస్తుతం ఐదు నెలల గర్భవతి అని తెలిసింది.

క్లుప్తంగా

ప్రభుత్వ సలహాదారుకు జన్మదిన శుభాకాంక్షలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యవహారాల సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణు గోపాల్‌ యాదవ్‌ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నరేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఆయనను వేణు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: యాసంగి సీజన్‌ కోసం శ్రీరాం సాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200, అలీసాగర్‌ లిఫ్ట్‌ ద్వారా 360, గుత్ప లిఫ్ట్‌ ద్వారా 270, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 445 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1090.80 (79.65 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

నేడు పాసింగ్‌ అవుట్‌ పరేడ్‌

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్‌ ఏడో బెటాలియన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లకు శుక్రవారం పాసింగ్‌ అవుట్‌ పరేడ్‌ నిర్వహించనున్నట్లు కమాండెంట్‌ పి సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎస్పీ ట్రెయినీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన 463 మందికి గత 9 నెలలుగా డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన నేపథ్యంలో పాసింగ్‌ పరేడ్‌ నిర్వహించి ఆయా బెటాలియన్‌లలో విధుల కేటాయింపునకు సంబంధించి నియామక ఉత్తర్వులను ముఖ్య అతిథిగా హాజరుకానున్న మెదక్‌ ఐజీ ఎస్‌ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథిగా నిజామాబాద్‌ ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ పాల్గొంటారని పేర్కొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్‌ టోర్నీకి ఎంపిక



డిచ్‌పల్లి: పంజాబ్‌ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్‌ బేస్‌బాల్‌ మహిళల టోర్నమెంట్‌కు మండలంలోని సుద్దపల్లిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల క్రీడాకారిణులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ నళిని గురువారం తెలిపారు. తమ కళాశాల క్రీడాకారిణులు సుమలత, నిషా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర జట్టుతోపాటు సుమలత, నిషా పంజాబ్‌కు బయల్దేరి వెళ్లారని జిల్లా బేస్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు మధుసూదన్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్‌కుమార్‌ తెలిపారు.

నియామకాలపై నీలినీడలు

- కాంట్రాక్ట్‌ స్టాఫ్‌ నర్స్‌, ఏఎన్‌ఎం పోస్టుల వ్యవహారం తేలేనా?
- కరోనా విపత్కర పరిస్థితుల్లో సేవలందించిన వారిని పట్టించుకోరా..
- జిల్లా అధికారుల మౌనంపై అనుమానాలు



నిజామాబాద్‌నాగారం: వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్ట్‌ ప్రాతిపదికన స్టాఫ్‌నర్స్‌, ఏఎన్‌ఎం పోస్టుల భర్తీపై నీలినీడలు కమ్ముకున్నాయి. కరోనా విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను పణంగాపెట్టి సేవలందించామని, స్టాఫ్‌నర్స్‌ నియామకాల సందర్భంగా తమను పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను పరిగణనలోకి తీసుకోవాలని ఉన్నతాధికారులు అనుమతిచ్చినప్పటికీ జిల్లా అధికారులు మౌనంగా ఉండడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

ఇదిలా ఉండగా ఓ షాడో కనుసన్నల్లోనే కాంట్రాక్ట్‌ ఆయూష్‌ ఉద్యోగులతో సర్టిఫికెట్లను ప్రత్యేక గదిలో వెరిఫికేషన్‌ చేయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్ట్‌ ప్రాతిపదికన 30 స్టాఫ్‌ నర్సులు, మూడు ఏఎన్‌ఎం పోస్టులను భర్తీ చేసేందుకు ఏడాది క్రితం నోటిఫికేషన్‌ జారీ చేశారు. స్టాఫ్‌ నర్స్‌ పోస్టులకు 876 మంది, ఏఎన్‌ఎం పోస్టులకు 323 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పార్లమెంట్‌ ఎన్నికల కోడ్‌, శాఖపరమైన బదిలీల నేపథ్యంలో దరఖాస్తుల పరిశీలనలో జాప్యం నెలకొంది.

కరోనా విపత్కర పరిస్థితుల్లో జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో సేవలందించిన తమకు అవకాశం కల్పించాలని తొమ్మిది మంది స్టాఫ్‌ నర్సులు కోరగా, వైద్యారోగ్యశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఓకే చెప్పారు. ఆ తరువాత జిల్లా కలెక్టర్‌తోపాటు డీఎంహెచ్‌వోను సైతం కలిసి విన్నవించారు. జూన్‌ నెలలో అనుమతి తీసుకున్న తర్వాతా కూడా వైద్య రోగ్యశాఖలోని అధికారులు చూద్దాం.. అంటూ మీకు పాయింట్లు వేస్తామంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఐదేళ్లపాటు జీజీహెచ్‌లో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించామని, కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పని చేసినందుకు 9 నెలలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని ఆవేదన చెందుతున్నారు.

షాడో ఓకే అంటేనే భర్తీకి ఆదేశాలు..

జిల్లాకు కొత్తగా వచ్చిన వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయంలో షాడో రాజ్యమేలుతున్నాడు. ఆ అధికారి డీఎంహెచ్‌వో ఎక్కడికి వెళ్తే అక్కడికి తనిఖీలకు వెళ్లేవారు. అంతటి ఆగకుండా ఉద్యోగులపై పెత్తనం చేసేవాడు. దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో సదరు షాడో అధికారి వెనక్కి తగ్గినప్పటికీ.. ప్రస్తుతం కాంట్రాక్ట్‌ పోస్టుల భర్తీలో కీలకపాత్ర పోషిస్తున్నాడనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో అన్ని సెక్షన్‌లకు సంబంధించి సూపర్‌వైజర్లు, ఇతర రెగ్యులర్‌ ఉద్యోగులు ఉండగా, ఆర్మూర్‌ పరిధిలో విధులు నిర్వహించే కాంట్రాక్ట్‌ ఆయూష్‌ ఉద్యోగులతో రెండు నెలలుగా వెరిఫికేషన్‌ పేరుతో కాలయాపన చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. భర్తీ ప్రక్రియ మూడు అడుగుల ముందుకు... ఆరుడుగులు వెనక్కి అన్నచందంగా మారింది.

జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో ఎస్టాబిలేషన్‌ సెక్షన్‌ సూపర్‌వైజర్‌, ఇతర సెక్షన్‌లకు సూపర్‌వైజర్‌లు, రెగ్యులర్‌ ఉద్యోగులు చాలా మంది ఉన్నారు. వీరిని కాదని ఆర్మూర్‌లో కాంట్రాక్ట్‌ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న ఆయూష్‌ ఉద్యోగులను ఉన్నతాధికారి తన చాంబర్‌లోని రెస్ట్‌ రూమ్‌లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌ చేయించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

వెరిఫికేషన్‌పై అనుమానాలు

రెగ్యులర్‌ ఉద్యోగులు ఉండగా, ఆయూష్‌ విభాగంలో కాంట్రాక్ట్‌ ప్రాతిపదికన పనిచేస్తున్న వారితో సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌ చేయించడంపై శాఖలోని ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆయూష్‌ ఉద్యోగులు సుమారు రెండు నెలలుగా విధులకు వెళ్లకుండా ఇక్కడే ఉండి రెగ్యులర్‌ ఉద్యోగులపై సైతం పెత్తనం చెలాయించడంపై విసుక్కుంటున్నారు.

స్టాఫ్‌ లేకపోవడంతోనే..



ఉద్యోగుల కొరత ఉంది. పైగా అందరు కారుణ్య నియమకాల ద్వారా ఉద్యోగంలో చేరారు. వెరిఫికేషన్‌లో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ప్రతిభ ఉన్న కాంట్రాక్ట్‌ ఆయూష్‌ ఉద్యోగులతో వెరిఫికేషన్‌ చేయిస్తున్నా. మా శాఖలో సూపర్‌వైజర్లు, ఉద్యోగులతో కూడా పనులు చేయిస్తున్నాం. – రాజశ్రీ, డీఎంహెచ్‌వో

ప్రభుత్వ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలి



భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని(చందూర్‌): ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నెలకొల్పిన ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. చందూరు మండల కేంద్రంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి పేదల కోసం ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పేదల కోసం ఆస్పత్రులను నిర్మించడం జరిగిందని, రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఆస్పత్రులను అన్ని సౌకర్యాలతో, హంగులతో నిర్మించామన్నారు. చందూర్‌లో ఆస్పత్రి నిర్మాణానికి దాతలు భూమిని విరాళంగా ఇవ్వడం హర్షణీయమని అన్నారు. కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆగ్రో ఇండస్ట్రీస్‌ చైర్మన్‌ కాసుల బాలరాజు, చందూరు మాజీ జెడ్పీటీసీ అంబర్‌ సింగ్‌, సర్పంచులు సత్యనారాయణ, సాయిరెడ్డి, విండో చైర్మన్‌ అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమిని కబ్జా చేసిన నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని కొండూర్‌ శివారులో ఉన్న నల్ల పోచమ్మ ఆలయ భూమిని మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత భర్త ఆకుల రాఘవేందర్‌తోపాటు గడీల రాములు ఆక్రమించారని కాంగ్రెస్‌ పార్టీకి చెందిన పలువురు నాయకులు, రైతులు, స్థానికులు ఆరోపించారు. ఆలయం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1976కు ముందే కొండూరు గ్రామానికి చెందిన గౌర శంకర్‌ అనే వ్యక్తి 199 సర్వేనెంబర్‌లోని 12 ఎకరాల 11 గుంటల భూమిలో కబ్జా ఉన్నట్లు తెలిపారు. ఆ భూమిలో నుంచే నల్లపోచమ్మ ఆలయానికి 38 గుంటల వదిలేశాడని పేర్కొన్నారు. 38గుంటల భూమిని ఆకుల రాఘవేందర్‌, గడీల రాములు 19గుంటల చొప్పున పట్టా చేయించుకుని పాస్‌పుస్తకాలు పొందారని తెలిపారు. కబ్జా చేసిన భూమిలో రాత్రి వేళలో బోరు వేశారన్నారు. గతంలో పనిచేసిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల సాయంతో భూమిని తమ పేర్లపైకి మార్చుకున్నారని తెలిపారు. 2016 వరకు ఆ భూమి రమగిరి మణెమ్మ పేరుపైనే ఉందని, అనంతరం పహణీలో ఎవరిపేరు లేకపోవడంతో చివరకు అధికారులను మభ్యపెట్టి 38 గుంటల భూమిని పట్టా చేసుకున్నారని ఆరోపించారు. దీనిపై రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ భూపతిరెడ్డికి విన్నవించగా నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌, తహసీల్దార్‌ను పిలిపించుకొని బాధితులకు వెంటనే న్యాయం చేయాలని ఆయన ఆదేశించారన్నారు. భూమి యజమానులకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామని, దీనరిపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో అగ్గు భోజన్న, వెంకట్‌రెడ్డి, రాజారెడ్డి, తిర్మన్‌పల్లి, పాల్దా, కాలూరు, ఖానాపూర్‌, కొండూరు, ఆశోక్‌ఫారం, శ్రీనగర్‌, కొట్టయ్యఫారం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

బాక్సులు ఓకే .. మందులేవి..?



ఆర్టీసీ బస్‌లో ఖాళీగా ఉన్న ఫస్ట్‌ ఎయిడ్‌ బాక్స్‌

బాన్సువాడ: ప్రయాణికుల భద్రతే లక్ష్యం, వారి సంఖ్య పెంచడమే ధ్యేయం అని చెప్పే ఆర్టీసీ అధికారులు కనీస వైద్య సదుపాయాలు కల్పించడం లేదు. విధిగా బస్సుల్లో ఫస్ట్‌ ఎయిడ్‌ కిట్లు అందుబాటులో ఉంచాలి. అయితే బస్సుల్లో బాక్సులు ఏర్పాటు చేశారే తప్ప మందులు అందుబాటులో ఉంచడం లేదు. బాక్సుల్లో మందులు లేకపోవడంతో ప్రమాద సమయాల్లో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రవాణా శాఖ అధికారులు బస్సులను రిజిస్ట్రేషన్‌ చేసే సమయంలో మాత్రమే ఫస్ట్‌ ఎయిడ్‌ బాక్సులు ఉంటే చాలనుకుంటున్నారు. కానీ అందులో మందులు ఉంటున్నాయో లేదో పట్టించుకోవడం లేదు. ప్రతీ రోజు ఒక్క బాన్సువాడ డిపో పరిధిలో 40 రూట్‌లలో సుమారు 46 వేల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. అలాగే జిల్లాలో ఉన్న బాన్సువాడ, కామారెడ్డి ఆర్టీసీ డిపోలకు చెందిన ఏ బస్సులో కూడా మందులు కనిపించడం లేదు. రెండు డిపోలలో 192 బస్సులు నడుస్తున్నాయి. వీటిలో పేరుకే ఫస్ట్‌ ఎయిడ్‌ బాక్సులు ఉన్నా వాటిలో మందులు మాత్రం పెట్టడం లేదు.

నేడు ఉపాధి ప్రజావేదిక

డిచ్‌పల్లి: మండల పరిషత్‌ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ 15వ విడత సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజావేదిక శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో 2023 ఏప్రిల్‌ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన పనులపై ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు గ్రామస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల స్థాయి ప్రజావేదికలో సామాజిక బృందం గ్రామాల వారీ గా తనిఖీ చేసిన నివేదిక చదివి సమర్పిస్తారని ఎంపీడీవో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల ఉపాధిహామీ సిబ్బంది, పోస్టల్‌ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు, ప్రజలు ప్రజావేదికకు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న స్పెషల్‌ టీమ్‌పై దౌర్జన్యం
- జేసీబీ సీజ్‌.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



తిర్మలాపూర్‌ క్రాసింగ్‌ వద్ద సీజ్‌ చేసిన పొక్లెయిన్‌

రుద్రూర్‌: పొతంగల్‌ మండలంలోని మంజీర నది నుంచి ఇసుక అక్రమ రవాణ అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది. అధికారులను ఇసుక మాఫియా భయభ్రాంతులకు గురి చేస్తోంది. గత కొన్ని నెలలుగా రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందని ఫిర్యాదులు అందడంతో బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో మంజీర పరీవాహక ప్రాంతంలో ఇటీవల పర్యటించారు. ఆయన ఆదేశాల మేరకు పది రోజుల క్రితం ఇసుక అక్రమ రవాణా కట్టడికి రెవెన్యూ, పోలీసులతో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. బృందం ప్రతి రోజూ రాత్రి 9 నుంచి ఉదయం 6 వరకు పెట్రోలింగ్‌ చేస్తోంది. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత మండలంలోని తిర్మలాపూర్‌ క్రాసింగ్‌ వద్ద ప్రత్యేక బృందం ఇసుక టిప్పర్‌ను గుర్తించి అడ్డుకుని కోట గిరి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో పొతంగల్‌ గ్రామానికి చెందిన దత్తు అనే వ్యక్తి స్పెషల్‌ టీమ్‌ సభ్యులపై దౌర్జన్యం చేసి టిప్పర్‌ను అక్కడి నుండి తీసుకెళ్లాడని తహసీల్దార్‌ మల్లయ్య తెలిపారు. దీంతో ఇసుక లోడ్‌ చేసిన పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అధికారులను బెదిరించిన దత్తుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సందీప్‌ తెలిపారు.

అడ్డుకట్ట పడేనా?

పొతంగల్‌ మండలంలోని మంజీర నది నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. రెవెన్యూ, పోలీస్‌ సిబ్బందిపై ఇసుకాసురులు దౌర్జన్యం చేస్తుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గతంలో కొడిచర్ల శివారులో తాత్కాలిక చెక్‌ పోస్టుకు నిప్పు పెట్టారు. ఇసుక డంప్‌ల సంగతి చెప్పనవసరం లేదు. ఇసుక డంప్‌ చేసి దర్జాగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే ఇసుక అక్రమ దందాను అరికట్టవచ్చని స్థానికులు అంటున్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

మద్యం మత్తులో కిందపడి మృతి



కృష్ణ మృతదేహం

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో ఉన్న వ్యక్తి కిందపడి మృతి చెందిన సంఘటన నగరంలోని మూడోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గుర్బాబాది రోడ్డులో చోటు చేసుకుంది. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్‌ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లికి చెందిన కృష్ణ(35) బోరురిపేర్‌ చేసి వస్తానని చెప్పి ఈనెల 24వ తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. మద్యం తాగుతూ ఎక్కడపడితే అక్కడ పడిపోతున్న కృష్ణ గురువారం ఉదయం 9గంటలకు లలిత మహల్‌ థియేటర్‌ పక్కన పడి మృతి చెందాడు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో మునిగి పశువుల కాపరి..

రెంజల్‌(బోధన్‌): చెరువులో మునిగి పశువుల కాపరి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. రెంజల్‌ గ్రామానికి చెందిన తూర్పు రాజు (40) అనే వ్యక్తి గ్రామంలోని లియాక్‌ వద్ద పశువుల కాపరిగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. రోజూలాగే గురువారం పశువులను మేతకు తీసుకెళ్లాడు. స్థానిక పెద్ద చెరువులో పశువులను కడిగేందుకు దిగిన రాజు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేట్‌ ఆస్పత్రిలో మహిళ..

కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో ఓ మహిళ గురువారం మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మహిళ మృతి చెందిందని ఆమె బంధువులు ఆరోపించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్లారెడ్డి మండలం గండి మాసానిపేట గ్రామానికి చెందిన మాలకాని శాంతమ్మ (52) ఎడకాలు నడుము వద్ద ప్రమాదవశాత్తు విరగగా, జిల్లా కేంద్రంలోని ఓ కార్పొరేట్‌ ఆస్పత్రిలో ఆపరేషన్‌ కోసం ఐదురోజుల క్రితం అడ్మిట్‌ చేశారు. ఆమెకు షుగర్‌ ఉండటంతో వైద్యు లు చికిత్స అందిస్తూ, ఆరోగ్యశ్రీ అనుమతి రాగానే గురువారం ఆపరేషన్‌ చేస్తుండగా మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన తల్లి మృతి చెందిందని శాంతమ్మ కుమారుడు ప్రభాకర్‌ ఆరోపించారు. షుగర్‌ ఉండటం, ఆపరేషన్‌ సమయంలో గుండె నొప్పి రావడంతో మృతి చెందిందని, తమ నిర్లక్ష్యం లేదని ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

బాల్కొండ: ముప్కాల్‌ మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారి 44పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన బీహార్‌కు చెందిన రుషికేశ్‌(67) నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ముప్కాల్‌ ఎస్సై రజినీకాంత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. వరి నాట్లు వేసే పనుల కోసం వచ్చిన రుషికేశ్‌ జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రగాయాలపాలైన రుషికేశ్‌ను వెంటనే హైవే అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి



షౌకత్‌ బీ(ఫైల్‌)

ఎల్లారెడ్డి రూరల్‌: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన శతాధిక వృద్ధురాలు షౌకత్‌ బీ గురువారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. 103 ఏళ్ల షౌకత్‌ బీ అనారోగ్య కారణాలతో మృతి చెందిందన్నారు. మృతురాలికి కుమార్తెలు, కుమారుడు ఉన్నట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

బాల్కొండ: మండలంలోని బోదేపల్లి వద్ద ఆటో ట్రాలీ, ఆటో ఢీకొన్న ఘటనలో మండలంలోని వన్నెల్‌(బి) గ్రామానికి చెందిన ఆరుగురికి గాయాలయ్యాయి. వన్నెల్‌(బి) నుంచి వస్తున్న ట్రాలీ ఆటో అతి వేగంగా బాల్కొండ వైపు వస్తున్న క్రమంలో బోదేపల్లి వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. ఆటోలో ఉన్న ముగ్గురు మహిళలతోపాటు ముగ్గురు పురుషులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాల్కొండ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు సేవించి యువకుడి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన మంద దేవేంద్ర(20) అనే యువకుడు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దేవేంద్ర బుధవారం తన ఇంట్లో పురుగుల మందుతాగగా, కుటుంబ సభ్యులు గమనించి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

వృద్ధురాలిని కత్తితో బెదిరించి బంగారం చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని 80 క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న నర్సమ్మ(75) అనే వృద్ధురాలిని దుండగులు కత్తితో బెదిరించి బంగారం ఎత్తుకెళ్లినట్లు ఎస్సై గంగాధర్‌ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నర్సమ్మ 80 క్వార్టర్స్‌లో ఉంటుండగా, ఆమె కొడుకు మాధవనగర్‌లో, కూతురు హైదరాబాద్‌లో ఉంటున్నారు. బుధవారం రాత్రి దుండగులు నర్సమ్మ తలుపు తట్టారు. మాధవనగర్‌లో ఉంటున్న నీ కుమారుడికి యాక్సిడెంట్‌ అయ్యిందని చెప్పడంతో నర్సమ్మ తలుపులు తీసి బయటకు వచ్చింది. వెంటనే ఆమెను కత్తులు చూపించి బెదిరించి రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ చోరీకి యత్నం

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): మండల కేంద్రంలోని ఓ సైకిల్‌ షాపులో దుండుగులు చోరీకి పాల్పడ్డారని, అలాగే మసీద్‌ ముందున్న బైక్‌ను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారని స్థానికులు గురువారం తెలిపారు. పోలీసులకు సమాచారం అందించామన్నారు. అర్ధరాత్రి పెట్రోలింగ్‌ చేసి చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిషేధిత గుట్కా పట్టివేత



పిట్లం(జుక్కల్‌): మండల కేంద్రంలోని ఓ కిరాణా దుకాణంలో పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టి నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ.. విశ్వసనీయ సమాచారం మేరకు సంతోష్‌ కిరాణం అండ్‌ జనరల్‌ స్టోర్స్‌లో తనిఖీ చేయగా, రూ.2.35 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లు పట్టుబడ్డాయని, దుకాణం యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. తనిఖీలో ఏఎస్సై లింబాద్రి, హెడ్‌కానిస్టేబుల్‌ సాయాగౌడ్‌, మారుతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో దెబ్బతిన్న కల్వర్టు



శిథిలావస్థకు చేరిన కల్వర్టును గ్రామ పంచాయతీ వారు పట్టించుకోవడం లేదని, మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు లో డ్రెయినేజీపై నిర్మించిన కల్వర్టు దెబ్బతినడంతో అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టు ధ్వంసమై భారీ గుంత ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన కల్వర్టు గుంతను గమనించక అందులో పడిపోతే గాయాలపాలయ్యే అవకాశం ఉందంటున్నారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసుల్లో నలుగురికి జైలు శిక్ష

ఆర్మూర్‌టౌన్‌: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో ముగ్గురికి ఆర్మూర్‌ స్పెషల్‌ జ్యుడిషియల్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ గట్టు గంగాధర్‌ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్‌హెచ్‌వో సత్య నారాయణగౌడ్‌ తెలిపారు. ఆర్మూర్‌ పట్టణంలో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించ వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వారిని కోర్టులో హాజర్చగా న్యాయమూర్తి రెండురోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

బాల్కొండకు చెందిన వ్యక్తికి..

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన మహ్మద్‌ షఫీ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని ఎస్సై నరేశ్‌ తెలిపారు. షఫీని గురువారం ఆర్మూర్‌ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

మద్యం మత్తులో డయల్‌ 100కు కాల్‌ చేసిన వ్యక్తికి..

బాల్కొండ: మద్యం మత్తులో డయల్‌ 100కు కాల్‌ చేసి 14సార్లు తప్పుడు సమాచారం ఇచ్చిన మెండోరా మండల దూదిగాంకు చెందిన కుంట భోజన్నకు న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై నారాయణ తెలిపారు. భోజనన్ను ఆర్మూర్‌ మున్సిఫ్‌ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించారన్నారు. డయల్‌ 100ను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

బాలుడు అదృశ్యం



రత్నాకర్‌

నిజామాబాద్‌ రూరల్‌: నగరంలోని బైపాస్‌ రోడ్డులో ఉన్న అశోక కాంప్లెక్స్‌లో ఉంటున్న కొత్వాల్‌ రత్నాకర్‌(17) అనే బాలుడు అదృశ్యమైనట్లు రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ ఆరిఫ్‌ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్వాల్‌ రత్నాకర్‌ తండ్రి కొత్వాల్‌ శంకర్‌ బైపాస్‌లో ఉన్న అశోక రెసిడెన్సీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కిరాణాదుకాణానికి వెళ్తున్నానని చెప్పి సోమవారం మధ్యాహ్నం బయటికి వెళ్లిన తన కుమారు డు తిరిగి రాకపోవడంతో శంకర్‌ పలుచోట్లు వెతికాడు. ఆ చూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, రత్నాకర్‌ ఆచూకీ తెలిసిన వారు 87126 59849, 87126 59847 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్‌హెచ్‌వో కోరారు.